## క్లుప్తంగా

### తమ్మిన పోతరాజు సేవలు చిరస్మరణీయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ అభ్యున్నతికి నగర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, మాజీ శాసనసభ్యుడు తమ్మిన పోతరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. తమ్మిన పోతరాజు 113వ జయంతి సందర్భంగా శుక్రవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కొత్తపేటలోని పోతరాజు విగ్రహం వద్ద పార్టీ పతాకాన్ని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆవిష్కరించారు. పోతరాజు విగ్రహానికి జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ్మిన పోతరాజు పలుమార్లు శాసనసభ్యునిగా పనిచేసి విజయవాడలో మౌలిక సదుపాయాల కల్పనకు పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, సంగుల పేరయ్య తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

### రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



పటమట(విజయవాడతూర్పు): రోడ్డుపై చెత్త వేస్తే వారిపై కఠినంగా వ్యవహరించాలని వీఎంసీ మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలి లెనిన్ బాబు అన్నారు. సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో శుక్రవారం మొబైల్ కోర్టు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన కేసులను ఆయన విచారించారు. మొత్తం 17 కేసులు విచారణ చేయగా వారికి రూ.7980 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేసిన మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలను హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్–2 ప్రభుదాస్, ఏఎంఓహెచ్–2 డాక్టర్ బాబు శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్లు సలీం మహమ్మద్, శివరామ ప్రసాద్, సర్కిల్ –2 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోగల 11 కేవీ కామకోటినగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాలలో రెండున్నర గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు జోజినగర్, లక్ష్మీ నగర్ కాలనీ, చర్చి రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, రైతు బజార్ రోడ్డు, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

**భవానీపురం పరిధిలో...**

భవానీపురం పరిధిలోని 11 కేవీ మసీదు ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అల్లుడి పేట, నాగార్జున వీధి, మసీదు వీధి, ప్రెసిడెంట్ వీధి, రంగూన్ సాహెబ్ వీధిలో పైన పేర్కొన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందితో సహకరించాలని కోరారు.

### 21 నుంచి కార్తిక మాసోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో 21వ తేదీ నుంచి కార్తిక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపారు. 21వ తేదీ సాయంత్రం ఆకాశ దీపారాధనతో కార్తిక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని, 25వ తేదీ శనివారం నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 27న కార్తిక సోమవారం, నవంబర్ 1వ తేదీ శనివారం–చిలుక ఏకాదశి, 3న కార్తిక సోమవారం, 5న కార్తిక పౌర్ణమి, 10న కార్తిక సోమవారం, 15న కార్తిక ఏకాదశి, 17న కార్తిక సోమవారం, 18న మాస శివరాత్రి, 20న కార్తిక అమావాస్యను పురస్కరించుకుని స్వామి వారికి అన్నాభిషేకం(కుంభాభిషేకం) జరుగుతుందన్నారు. నవంబర్ 18న మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపార్చన జరుగుతుందన్నారు. కార్తికమాసంలో ప్రతి రోజు మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

# హవ్వ.. కారణం ఆర్వోనా..!

- న్యూరాజరాజేశ్వరీపేటలో 'డయేరియా'కు కారణం ఆర్వో వాటర్ ప్లాంట్లేనట
- కౌన్సిల్ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పిన వీఎంసీ కమిషనర్
- నివ్వెరపోతున్న ప్రజలు, బాధితులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సరిగ్గా నెల రోజుల క్రితం విజయవాడ న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంతాన్ని అల్లకల్లోలం చేసిన 'డయేరియా'కు కారణం ఆర్ఓ ప్లాంట్లేనంటూ విజయవాడ నగర పాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కౌన్సిల్ సాక్షిగా బాంబు పేల్చారు. నలుగురు అమాయక ప్రజల ప్రాణాలు బలికొని.. వందల మందిని డయేరియా బారిన పడేసి.. చావు అంచులు దాకా తీసుకువెళ్లిన ఆ నిలువెత్తు నిర్లక్ష్య నెపం తమది కాదంటూ చేతులు దులిపేసుకున్నారు. తమదేమీ తప్పు లేదంటూ అక్కడున్న నాలుగు వాటర్ ప్లాంట్లపై నిందను మోపిన ఆయన తీరుపై అటు కార్పొరేషన్ అధికారులు, ఇటు పలు పార్టీల నాయకులు, ప్రజలు, బాధితులంతా నివ్వెరపోతున్నారు.

#### కమిషనర్‌కు సూటిగా ప్రశ్నల వర్షం

డయేరియాకు కారణం న్యూఆర్ఆర్‌పేటలోని నాలుగు వాటర్ ప్లాంట్లేనని.. వాటిలో వచ్చిన నీటి వల్లే సమస్య వచ్చిందని ల్యాబ్ రిపోర్టుల్లో తేలితే మరి డయేరియా సోకిన సమయంలో అక్కడున్న రెండు వాటర్ ప్లాంట్లకు ఏ కంపెనీ అయితే నీటిని సరఫరా చేస్తుందో.. అదే నీటిని మీరు ప్రజలకు తిరిగి ఎలా సరఫరా చేశారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- డయేరియా బారిన పడిన బాధితులెవ్వరూ అసలు ఆ ఆర్వో ప్లాంట్ నీటిని తాగరు. మరి అలాంటప్పుడు వారంతా డయేరియా బారిన ఎలా పడ్డారు.
- ఆర్ఓ ప్లాంట్లే కారణమని ల్యాబ్ పరీక్షల్లో తేలితే.. ఆ విషయాన్ని నెల రోజుల పాటు ఎందుకు చెప్పలేదు.. ఆ ప్లాంట్లలో ఏ లోపాలను గుర్తించారు.
- అవే ఆర్వో ప్లాంట్లలో నీటి కలుషితమే జరగలేదని.. అంతా బాగుందని కానూరులోని వీఆర్ సిద్ధార్థ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని సివిల్ ఇంజినీరింగ్ శాఖ ఎలా సర్టిఫికెట్ ఇచ్చింది.
- న్యూఆర్ఆర్‌పేటలోని వాటర్ ట్యాంక్ వద్ద, కుమార్ టీస్టాల్ ఎదురు పార్కులో వేసిన జంబో బోర్ల మోటర్ల ద్వారా ఎటువంటి నిర్ధారణ పరీక్షలు చేయకుండా కార్పొరేషన్ అధికారులు నీటిని సరఫరాను ఎలా చేశారు. డయేరియాకు అవి కారణాలు కాకపోతే డయేరియా బయటపడిన తర్వాత ఆ జంబో బోర్లకు మీరు ఎందుకు సీలు వేయించారు. న్యూఆర్ఆర్‌పేటలో ప్రధాన పైపులైన్ల లీకులను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించి.. కొత్తగా అర కిలో మీటర్ మేర తాగునీటి పైపులైన్లను మార్చింది నిజం కాదా అని స్థానికులు, బాధితులు కమిషనర్ మీద ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కార్పొరేషన్ కమిషనర్ ఒక బాధ్యత గల అధికారిగా కాకుండా అధికార పార్టీ నాయకుడిలా మాట్లాడినట్లు ఉందని విమర్శిస్తున్నారు.



ఆర్ఓ ప్లాంట్లకు సరఫరా అయ్యే నీటినే డయేరియా సమయంలో పంపిణీ చేస్తున్న వీఎంసీ సిబ్బంది



న్యూఆర్ఆర్‌పేటలో డయేరియా అనంతరం సీజ్ చేసిన జంబో బోర్లు

#### ఆ నీటినే తాగం



నేను, మా పాప డయేరియా బారినపడి ప్రభుత్వ ఆస్పత్రిలో నరకయాతన అనుభవించాం. అసలు మేము ఆర్ఓ ప్లాంట్ నీటినే తాగం. మంచినీటి కొళాయిల్లో నుంచి వచ్చే నీరే తాగుతాం.

బి.రమణ, బాధితురాలు

#### మా బావ మృతిచెందారు



మేము మంచినీటి కొళాయిల్లో వచ్చే నీటిని పట్టుకొని తాగడం తప్ప ఆర్ఓ ప్లాంట్లలో నీళ్లను అస్సలు కొనము. మా కుటుంబమంతా కొళాయి నీళ్లు తాగే డయేరియా బారినపడ్డాం. మా బావ నరసింహారావు ఈ నీరు తాగే మృతిచెందారు.

కుమారి, బాధితురాలు

### మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన ఉండాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైకాలజీ కౌన్సిలర్ ఎస్.వనదుర్గ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గొల్లపూడిలోని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ విద్యా అకాడమి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి వనదుర్గ మాట్లాడుతూ మన ఆలోచనలు, భావోద్వేగాలను నియంత్రించుకోగలగాలని అన్నారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని సరైన నిర్ణయాలు తీసుకోవాలి తప్ప క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని చెప్పారు. దేశంలో ప్రతి ఆరుగురిలో ఒకరు ఏదో ఒక మానసిక ఇబ్బందికి గురవుతున్నవారేనని అన్నారు. డిప్రెషన్, ఆందోళన, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వలన ఎక్కువ మంది మానసికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపే వాటన్నింటికీ దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఆవుల వెంకట్రావు, యువజన సంఘం సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తరుణ్ బాబు పాల్గొన్నారు.

## వైద్యాన్ని పేదలకు దూరం చేయటమే కూటమి లక్ష్యం

- జేబులు నింపుకోవటానికే కూటమి సర్కార్ పీపీపీ మంత్రం
- పీపీపీకి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ
- ఆవిష్కరించిన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ వైద్యాన్ని రాష్ట్రంలో పేదలకు దూరం చేయటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఆరోపించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్‌ను ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు వైద్య విద్యను దూరం చేయటానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. గతంలో రాష్ట్రంలో 12 మెడికల్ కళాశాలలు ఉంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 17 మెడికల్ కళాశాలలకు భూములు కేటాయించి నిర్మాణాలు ప్రారంభించారన్నారు. ఏడు కళాశాలలను పూర్తి చేసి వైద్య విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కానీ మాకు మెడికల్ సీట్లు వద్దు అని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన దుర్మార్గపు ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో జేబులు నింపుకునే పనిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైజాగ్ నుంచి నర్సీపట్నం పర్యటనలో అనేక ఇబ్బందులకు గురిచేశారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాదరణ తగ్గలేదని, వేలాదిగా ప్రజలు పాల్గొని నీరాజనాలు పలికారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో యువత, మహిళలు, రైతులు అన్ని వర్గాలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. అక్టోబర్ 10 నుంచి నవంబర్ 24 వరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దశల వారీగా నిర్వహించి గవర్నర్‌కు అందజేసి ప్రజల అభిప్రాయాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, శీరంశెట్టి పూర్ణ, బి.కోటిరెడ్డి, ఇర్ఫాన్, దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ హయత్, పార్టీ సీనియర్ నేతలు దాసి జయ ప్రకాష్ కెనడీ, బూదాల శ్రీనివాసరావు, పాదిలి చంటి తదితరులు పాల్గొన్నారు.

## గణపతికి పంచామృత అభిషేకాలు, హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై గణపతికి పంచామృత అభిషేకాలు, హోమాలు, పూజలను నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గణపతి ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో స్వామి వారికి అభిషేకాలు, గణపతి హోమం నిర్వహించగా, హోమంలో ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం ఉండ్రాళ్లను నివేదనగా సమర్పించారు. గణపతికి నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ ఈవో దంపతులు, వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు

### జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు గగన్‌శ్రీ ఎంపిక

ఇబ్రహీంపట్నం: జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కళాశాలకు చెందిన కోలపనేని గగన్‌శ్రీ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ తెలిపారు. ఈనెల 4 నుంచి 7 వరకు అనంతపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ అండర్ 17 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిందన్నారు. అత్యుత్తమ ప్రతిభ చాటిన ఆమెను ఒడిశాలో డిసెంబర్ నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. ఆమెను కళాశాల కరస్పాండెంట్ నజీఫ్ పాషా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్ వలి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాగులమీరా, అధ్యాపకులు అభినందించారు.

## మహిళా సమస్యలపై త్వరలో ఆన్‌లైన్ పోర్టల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళల సమస్యల సత్వర పరిష్కారానికి త్వరలో ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్, ఏపీ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాలలో శుక్రవారం స్పాట్ లైట్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మాట్లాడుతూ బాలికా దినోత్సవాలు అంటూ ఒక్క రోజు జరుపుకోవడం కాదని, ఏడాది మొత్తం అవగాహన సదస్సులు జరుపుకొన్నప్పుడే అద్భుత ఫలితాలు సాధించగలమన్నారు. తద్వారా సమాజంలో సైతం మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలికలు, మహిళలు చదువుకునే సమయంలో, ఉద్యోగ విధుల్లో ఉన్న సమయంలో ఎటువంటి భయం లేకుండా జీవితం కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలు, బాలికలు స్వయంగా తమ కార్యాలయానికి రాలేని పరిస్థితులు ఉండటం, మరొక సందర్భంలో తమ వివరాల గోప్యత వంటి విషయాలను గుర్తించి ఆన్‌లైన్ పోర్టల్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. మార్పు ట్రస్ట్ చైర్‌పర్సన్ ఆర్.సూయజ్ రాయపాటి శైలజతో ముఖాముఖి నిర్వహించారు. మహిళలపై నేడు జరుగుతున్న అఘాయిత్యాలు, సోషల్ మీడియా వేదికగా వేధింపులు ఇలా పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు రాయపాటి శైలజ విపులంగా సమాధానాలు చెప్పారు.





మాట్లాడుతున్న రాయపాటి శైలజ

## అనారోగ్య కారణాలతో వడ్రంగి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్య కారణాలతో వడ్రంగి కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దీనదయాళ్‌నగర్‌కు చెందిన బింక మల్లేశ్వరి, జగ్గారావు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. జగ్గారావు వడ్రంగి పని చేస్తుంటాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ప్రమాదంలో జగ్గారావుకు తలకు గాయం కాగా వైద్యం చేయించారు. రెండు నెలల కిందట జగ్గారావుకు ఫిట్స్ రావడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా, మద్యం తాగడం మానేయాలని, మందులు క్రమం తప్పకుండా వాడాలని డాక్టర్లు చెప్పారు. అయితే కొద్ది రోజులుగా జగ్గారావు మందులు వేసుకోనని ఇంట్లో గొడవ చేయసాగాడు. శుక్రవారం ఉదయం మల్లేశ్వరి పనికి వెళ్లగా, జగ్గారావు ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. సాయంత్రం 5 గంటల సమయంలో మల్లేశ్వరికి తల్లి ఫోన్ చేసి ఇంట్లో జగ్గారావు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పింది. ఇంటికి వచ్చి చూసేసరికి రేకుల షెడ్డు రాడ్‌కు చీరతో ఉరి వేసుకున్నట్లు గుర్తించింది. ఘటనపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## అనుమతి లేనిదే బాణసంచా విక్రయం నిషేధం

పటమట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ అనుమతి లేకుండా దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా విక్రయించకూడదని, వీధి విక్రయదారులు నిర్దేశిత ప్రదేశాలలోనే బాణసంచా విక్రయించాలని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనం మీటింగ్ హాల్లో దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకందారులతో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకందారులు అగ్ని ప్రమాదం జరగకుండా కచ్చితంగా ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని అన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు మాట్లాడుతూ వీఎంసీకి ప్రధానంగా సురక్షితమైన దీపావళి జరుపుకోవడమే ముఖ్యమని, విక్రయదారులు వారి చుట్టుపక్క నివాసులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందికరమైన, ప్రమాదకరమైన వాతావరణం ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరగకుండా ఉండాలంటే కేవలం విలాసవంతమైన ఓపెన్ గ్రౌండ్‌లో మాత్రమే బాణసంచా అమ్మటానికి అనుమతిని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ మాట్లాడుతూ వీధి విక్రయదారులు కేవలం నిర్దేశిత ప్రదేశాలలోనే అమ్మకాలు చేయాలని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, నగర పరిధిలోని బాణసంచా అమ్మకందారులు, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



బాణసంచా విక్రయదారులకు సూచనలిస్తున్న వీఎంసీ అధికారులు

### సీజేఐ గవాయ్‌పై దాడి అనాగరిక చర్య

#### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)పై దాడి అనాగరిక చర్య అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీజేఐ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం జాతీయ నాయకుడు సుంకర రాజేంద్రప్రసాద్, పౌర హక్కుల సంఘం (సి.ఎల్.సి) రాష్ట్ర అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర నాయకుడు మాల్యాద్రి, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకట్ రెడ్డి, ఎం.సి.పి.ఐ(యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్ బాషా, ఓపీడీఆర్ రాష్ట్ర నాయకుడు సి.భాస్కరరావు, విరసం నాయకుడు అరసవల్లి కృష్ణ, పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగాభవాని, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.పద్మ, ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షుడు ముని శంకర్ పాల్గొన్నారు.

## డయేరియాపై కూటమి ప్రభుత్వం అబద్ధాలు

\+ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ప్రబలిన డయేరియాపై అధికారులతో కూటమి ప్రభుత్వం అబద్ధాలు మాట్లాడిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. శుక్రవారం సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని న్యూరాజరాజేశ్వరిపేటలో డయేరియాతో నెల రోజుల క్రితం నలుగురు మృత్యువాత పడ్డారన్నారు. వందల మంది అనారోగ్యం పాలయ్యారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం రాలేదన్నారు. పైగా కార్పొరేషన్ మంచినీటి కాలుష్యం అతిసారకు కారణం కాదని, నాలుగు ప్రైవేట్ ఆర్ఓ ప్లాంట్ల నీటి వల్ల ఈ పరిస్థితి వచ్చిందని వీఎంసీ సమావేశంలో ఉన్నతాధికారులు చెబుతూ తప్పును కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. రాజరాజేశ్వరిపేటలోని అన్ని వీధుల్లో అతిసార రావడం యాదృచ్ఛికమా? అందరూ ఆర్వో ప్లాంట్ నుంచే నీరు తాగారా? వీఎంసీ నీరు కలుషితం కాలేదని ఎలా సర్టిఫికెట్ ఇస్తారు.? నివేదికల్లో ఏముందో వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. బాధితులు కార్పొరేషన్ మంచినీరు తాగడం వల్లే అనారోగ్య పాలయ్యామని వాపోతున్నారని అన్నారు. అయితే అధికారుల చేత ప్రభుత్వమే అబద్ధం చెప్పించడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. దీనికి ప్రజాప్రతినిధులు, మున్సిపల్ శాఖ బాధ్యత వహించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో వందలాది మంది ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురైనా ఎంపీ, ఎమ్మెల్యేలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదన్నారు. మృతిచెందిన కుటుంబాలకు రూ. 10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి. రమణరావు పాల్గొన్నారు.